# ధూపదీప నైవేద్యాల నిధులూ స్వాహా చేస్తున్నారు

**రెండు నెలలుగా పూజారులకు జీతాల్లేవ్**

**వేధింపులు ఆపకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమం**

**యంనాంపేట్ రంగనాథ స్వామి ఆలయ కమిటీపై భాగ్యనగర అర్చక పురోహిత సంఘం ఆగ్రహం**

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 19, ప్రభాతవార్త:** పోచారం సర్కిల్ యంనాంపేట్ శ్రీ రంగనాథ స్వామి దేవాలయ అర్చకులపై పాలక మండలి దుర్భాష లాడటం, వేధింపులకు పాల్పడాటాన్ని తీవ్రంగా ఖండి స్తున్నట్లు భాగ్యనగర అర్చక పురోహిత సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు గట్టు శ్రీనివాసాచార్యులు తెలి పారు. యంనంపేట్ శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆలయ కమిటీ సభ్యులు ఇక్కడి అర్చకులపై దూషణలకు పాల్పడుతూ వేధింపులకు గురిచేయడం సరికాదన్నారు. పాలక మండలి ఉన్నది దేవాలయ అభివృద్ధికి కృషి చేయటానికనీ, ఆలయ నిధులు స్వాహా చేయడానికి కాదని పేర్కొన్నారు. దేవాదాయ శాఖ అధికారులను, పూజారులను వేధింపులకు గురిచేయడం తక్షణం ఆపాలని, కొనసాగితే రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చూడుతామని హెచ్చరించారు. పాలక మండలితీరుతో అర్చకులకు రెండు నెలలుగా జీతాలు రాలేదని, ఆలయ ధూపదీపనైవేద్యాలకు అయ్యే ఖర్చుసైతం గత కొన్ని నెలలుగా చెల్లించడంలేదని ఆలయానికి విచ్చేసే భక్తుల సంఖ్య తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో రాష్ట్ర అర్చక పురోహితం సంఘం సభ్యులు గంగు సత్యం, రవీంద్ర శర్మ, మంగేశ్ శర్మ, శ్రీకాంత్, కృష్ణమాచార్యులు, పవన్‌శర్మ, గోపి కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అర్చక పురోహిత సంఘం అధ్యక్షుడు శ్రీనివాసాచార్యులు



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్ వార్త

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ఘట్‌కేసర్, డిసెంబరు 19, ప్రభాతవార్త:** విద్యుత్ డిసి డబ్ల్యు పనులు, కరెంట్ తీగల కింద చెట్లకొమ్మలు తొలగి స్తున్న కారణంగా శనివారం వి ద్యుత్ సరఫరాకు అంత రా యం కల్గుతుందని విద్యుత్ ఏ ఈ యశ్వంత్‌కుమార్ తెలి పారు. 11 కెవి చందు పట్ల గూడ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సాయంత్రం 4 గంటల నుంచి 4:30 గంటల వరకు నిలిపివేస్తామన్నారు.



యశోద ఆసుపత్రిలో కోట్‌పల్లి నూతన సర్పంచ్ బసమ్మ భర్త సంగయ్యను పరామర్శిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, వికారాబాద్ డిసిసి అధ్యక్షులు ధారాసింగ్

## కోట్‌పల్లి కొత్త సర్పంచ్ భర్తపై

# అర్ధరాత్రి దాడి



సర్పంచ్ భర్త సంగయ్యపై దాడిని ఖండిస్తూ కోట్‌పల్లిలో రాస్తారోకో చేస్తున్న దృశ్యం



నిందితులను అరెస్టు చేయందే ఆందోళన విరమించేది లేదని వాగ్వాదం చేస్తున్న గ్రామస్తులు

**కోట్‌పల్లి, డిసెంబరు, 19, ప్రభాతవార్త;** వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండల కేంద్రంలో నూతన సర్పంచ్‌గా ఎన్నికైన జంగం బసమ్మ భర్త సంగయ్యపై గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఇనుప రాడ్డులతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సంగయ్యకు తీవ్ర గాయాలవడంతో హుటాహుటిన అత్యవసర చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. గ్రామంలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బాధితుడు సంగయ్య ఇటీవల వరకూ బిఆర్ ఎస్‌లో ఉన్నారు. దశాబ్దకాలం క్రితం ఉపసర్పంచ్‌గా కూడా వ్యవహరించారు. తాజాగా అధికార పార్టీ నేతల స్నేహ హస్తం అందుకున్నారు. అయితే కాంగ్రెస్ పార్టీలో అధికారికంగా చేరలేదు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికలలో కాంగ్రెస్ నుంచి నక్కల విజయలక్ష్మి, బిఆర్‌ఎస్ నుంచి ఉప్పరి స్వప్న పోటీ చేయగా తన భార్య జంగం బసమ్మ బసవమ్మతో ఇండిపెండెంట్ అభ్యర్థిగా సంగయ్య పోటీ చేయించారు. ఆమె దాదాపు 200 ఓట్ల ఆధిపత్యంతో విజయం సాధించగా... బసవమ్మ మద్దతుదారులు ఆనందోత్సాహాలతో ప్రమాణస్వీకారానికి సమయ త్తమవుతున్నారు. ఈనేపథ్యంలో గురువారం రాత్రి 11.30 గంటల సమయంలో సంగయ్య కోట్‌పల్లిలోని తన ఇంటి వద్ద ఉండగా కొంతమంది దుండగులు గుర్తు తెలియకుండా మాస్కులు ధరించి దాడి చేశారు. తీవ్రంగా గాయాలవడంతో ఆయన సొమ్మసిల్లిపోయారు. పరిస్థితి విషమిస్తుందన్న భయంతో హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి హుటాహుటిన తరలించారు. ఈ దాడి సంఘటనతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. శుక్రవారం దాదాపు రెండు గంటల పాటు గ్రామంలోని ప్రధాన రోడ్డుపై భైటాయించి గ్రామస్తులు రాస్తారోకో చేశారు. దుండగులను తక్షణమే అరెస్టు చేయాలని పట్టుపట్టారు. వికారాబాద్ డిఎస్‌పి శ్రీనివాస్‌రెడ్డి, ధారూర్ సిఐ రాఘరాం, మోమిన్‌పేట్ సిఐ వెంకట్, స్థానిక ఎస్‌ఐ శైలజ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపుచేసే ప్రయత్నం చేశారు. స్పష్టమైన హామీ ఇవ్వందే రాస్తారోకో విరమించేది లేదని ఆందోళనకారులు భీష్మించుకుని కూర్చున్నారు. నిందితులను అరెస్టు చేస్తామని, ఎవరినీ వదిలే ప్రసక్తి లేదని డిఎస్‌పి హామీ ఇవ్వడంతో మండల వాసులు ఆందోళన విరమించారు. సంగయ్య భార్య బసవమ్మ ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. నూతన సర్పంచ్ బసమ్మ భర్త సంగయ్య స్వామిపై హత్యయత్నం చేసిన వ్యక్తలపై కఠిన చర్యలు తీసుకోవాలని బిసి కమిషన్ మాజీ సభ్యులు శుభప్రద్ పటేల్ డిమాండ్ చేశారు. అత్యంత వెనుకబడిన జంగమ కులానికి చెందిన వారు గ్రామ సర్పంచ్‌గా గెలవగా.. ప్రమాణ స్వీకరం చేయకముందే సర్పంచ్ భరత్తను అంతమొందిచాలని చూడటం బాధాకమమన్నారు. గతంలో కుడా సంగయ్యపై కొంతమంది భౌతిక దాడులకు, బెదింపులకు పాల్పడ్డారని గుర్తుచేశారు. ఆ దాడుల సూత్రధారులే తాజాగా మళ్లీ దాడి చేయించారని ఆరోపించారు. దాడిలో తీవ్ర గాయాలైనసంగయ్యను ప్రభుత్వం అదుకోవాలని వారు కోరారు. హైదరాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు సంగయ్యను రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, వికారాబాద్ డిసిసి అధ్యక్షులు ధారసింగ్ పరామర్శించారు. దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకునేలా చర్యలు తీసుకుంటామని బాధితుని కుటుంబానికి హామీ ఇచ్చారు.

సంగయ్యపై హత్యాయత్యాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కోట్‌పల్లి బిఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షులు సుందరి అనిల్ తెలిపారు. ఇది కేవలం రాజకీయ దురుద్దేశాలతో కక్షసాధింపు చర్య అనిపిస్తోందని పేర్కొన్నారు. సర్పంచ్‌గా అయన భార్య ప్రమాణ స్వీకరణ కాకముందే ఇలాంటి చర్యకు పల్పాడటం వెనక రాజకీయ కోణం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. పోలీసు అధికారులు వెంటనే దుండగులను పట్టుకోవాలని డిమాండ్ చేశారు.

## ఏ చిక్కకుండా.. కొను గోల్‌మాల్

**తాండూరు మున్సిపాల్టీలో ఆగని చేతివాటం**




తాండూరు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలు, గోడలపై అధికారుల వివరాల పట్టిక

**(ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి)** ఎసిబి దాడుల తర్వాత భయం గుప్పెట్లో గడిపిన తాండూరు మున్సిపల్ అధికారులు క్రమంగా బయట పడుతున్నారు. ఎప్పటిలాగే అవినీతికి తలుపులు తెరిచినట్లున్నారు. ఎలాగూ పాలకవర్గం లేనందున ఇష్టారాజ్యంగా ప్రజాధనం దుబారా చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. సాధారణ నిధుల నుంచి ఇటీవల కొన్ని పనులకు రూ.లక్షల్లో ఖర్చు చేశారు. అడ్డగోలుగా రికార్డులు చేసి బిల్లులు స్వాహా చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. మున్సిపల్ కార్యాలయంలో నిఘా కెమెరాల ఏర్పాటు, గోడలపై వార్డు అధికారుల వివరాలను రాసేందుకు అక్షరాలా ఏడున్నర లక్షల రూపాయలు వెచ్చించినట్లు తెలిసింది. గతంలో ఆఫీసులో నిఘా కెమెరాలు ఉన్నాయని కిందిస్థాయి సిబ్బంది చెబుతున్నారు. కానీ నెల రోజుల క్రితం కొత్తగా 28 కెమెరాలను ఏర్పాటు చేశారు. ఆఫీసులో వివిధ విభాగాలలో, పరిసరాలలో వాటిని అమర్చారు. ఈ కెమెరాలకే ఐదు లక్షల రూపాయల వరకు ఖర్చు చేశారు. కమిషనర్ ఛాంబర్‌లో సెంట్రలైజ్ చేసి సిబ్బంది పనితీరును పర్యవేక్షిస్తుంటారు. ఆఫీసుకు వచ్చే వినియోగదారుల పట్ల ఎలా వ్యవహరిస్తున్నారనేది, మహిళా ఉద్యోగినిలతో సహచర ఉద్యోగులు అనుసరిస్తున్న తీరును కెమెరాల ద్వారా పరిశీలించవచ్చని కమిషనర్ భావిస్తున్నారు. కానీ దీన్ని ఆసరాగా తీసుకున్న కొంతమంది అధికారులు కెమెరాలకే భారీగా ధనం వెచ్చించడం పట్ల ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. కెమెరాలు కొనుగోలు చేసేందుకు లక్ష రూపాయలకు మించి ఖర్చు కాదని పలువురు మాజీ కౌన్సిలర్లు అంటున్నారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపితే వాస్తవాలు వెలుగు చూస్తాయని అంటున్నారు. ఇలా ఉండగా ప్రతి వార్డులో అధికారుల వివరాలను తెలియజేసే పట్టికను గోడలపై రాయించారు. పట్టణంలో 36 వార్డులు ఉన్నాయి. ప్రతి వార్డులో ఒకచోట వివరాల పట్టిక రాశారు. రాతలకూ రూ.2.50 లక్షల వరకు ఖర్చయినట్లు చెబుతున్నారు. ఆరు అడుగుల సైజులో గోడలపై వేసే సాధారణ పేయింటింగ్ ధరలు చాలా తక్కువగా అవుతాయని అంటున్నారు. ప్రస్తుతం ఈ రెండు అంశాలపై చేసిన ఖర్చులపై మాజీ కౌన్సిలర్లు మండిపడుతున్నారు. త్వరలో కలెక్టర్‌కు, మున్సిపల్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. ఇలా ఉండగా ఆరు నెలల క్రితం ఏసీబీ అధికారులు

- అధికారిక ఖర్చుల నమోదులో తప్పుడు లెక్కలు
- 28 నిఘా కెమెరాలకు రూ.5లక్షల బిల్లు
- రూ.లక్షకు మించి అవ్వదని మాజీ కౌన్సిలర్ల వాదన
- గోడపై సమాచార రాతల్లోనూ ఇదే తంతు
- వార్డుల వారీ అధికారుల వివరాల పట్టికకు రూ.2.50 లక్షల ఖర్చు చూపించిన సిబ్బంది
- అసలు లెక్కలు తేలాలంటే విచారణ జరపాల్సిందేని ప్రజాప్రతినిధుల డిమాండ్
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేయటానికి సమాయత్తం
- ఆరు నెలల క్రితం ఎసిబి సోదాలు
- ఈసారి దొరక్కుండా ఉండేందుకే సిసి కెమెరాల ఏర్పాటని స్థానికుల ఆరోపణ
- ప్రజాధనాన్ని దిగమింగేస్తున్నారని మండిపాటు

ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి జలగల తీరుమారడం లేదు. ఎసిబి సోదాల్లో పట్టుబడినా నిస్సిగ్గుగా ప్రజాధనానికి తూట్లు పొడుస్తూనే ఉన్నారు. తాండూరు మున్సిపల్ ఆఫీసులో ఎసిబి అధికారుల కదలికలు తెలుసుకోవడం కోసం ఏకంగా ఆఫీసు బయట నుంచి సిసి కెమెరాలను ఏర్పాటు చేయటం చర్చనీయాంసమైంది.






గురుకుల్‌లో వందేమాతరం గీతాలాపన చేస్తున్న సూర్యనారాయణ తదితరులు



పాల్గొన్న విద్యార్థులు, ఎబివిపి కార్యకర్తలు

**1300 మందితో**

# వందేమాతరం

**ఘట్‌కేసర్‌లో ఉప్పొంగిన దేశభక్తి**

**ఘట్‌కేసర్, డిసెంబర్ 19, ప్రభాతవార్త:** వందేమాతరం గీతానికి గొప్ప ప్రాముఖ్యత ఉందని జాతీయ సాహిత్య పరిషత్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణమూర్తి అన్నారు. ఘట్‌కేసర్ గురుకుల్ మైదానంలో శుక్రవారం ఎబివిపి ఆధ్వర్యంలో సాముహిక వందేమాతరం కార్యక్రమం నిర్వహించారు. వందేమాతరం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఘట్‌కేసర్‌శాఖ విద్యార్థులతో కలిసి వందేమాతర గీతాలాపాన చేశారు. గురుకుల్ కళాశాల, హైస్కూల్ విద్యార్థులు, ఎబివిపి కార్యకర్తలు దాదాపు 1300 మంది ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొన్నారు. జాతీయ సాహిత్య పరిషత్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణమూర్తి ముఖ్య వక్తగా విచ్చేసి ప్రసంగించారు. వందేమాతరం గీతం ప్రాధాన్యతను వివరించారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యసమితి సభ్యులు అంకం శ్యామ్ కిరణ్ మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి దేశభక్తి అలవరచుకొని వికసిత్ భారత్ కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలని తెలిపారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు వందేమాతరం గీతాలాపాన చేశారు. ఈకార్యక్రమంలో గురుకుల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, ఎబివిపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు భాను, సచిన్, నగర కార్యవర్గసభ్యులు ఉదయ్, గౌతమ్, హరి, రామకృష్ణ, ప్రవీణ్, బలరాం, అనిల్, మనోజ్, అనురాగ్, సాయిహర్ష తదితరులు పాల్గొన్నారు.

# మేకగూడలో కారు బీభత్సం

- తప్పతాగి అతివేగంగా నడిపిన డ్రైవర్
- పొలం నంచి స్కూటీపై ఇంటికెళుతున్న మహిళా రైతును ఢీ
- అక్కడికక్కడే బాధితురాలు మృతి
- పారిపోతున్న డ్రైవర్‌కు యువకులు దేహశుద్ధి
- రెండేళ్ల క్రితం మృతిచెందిన సునీత భర్త
- తాజా దుర్ఘటనతో అనాథలైన ఇద్దరు కుమారులు



ప్రమాదానికి కారణమైన కారు, గ్రామస్తుల అదుపులో డ్రైవర్



నుజ్జునుజ్జు అయిన స్కూటీ (ఇన్‌సెట్) మృతురాలు

**నందిగామ, డిసెంబరు 19, ప్రభాతవార్త :** నందిగామ మండలం మేకగూడ భారత్ పెట్రోల్ బంకు వద్ద శుక్రవారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. తప్ప తాగిన మైకంలో కారు డ్రైవింగ్ చేసి ఓ మహిళ నిండు ప్రాణాన్ని బలి తీసుకున్నాడు. సంఘటన వివరాలకు వెళితే .. స్థానిక పోలీసుల,గ్రామస్తుల కథనం ప్రకారం.. మేకగూడ గ్రామానికి చెందిన కంకంటి సునీత (36) శుక్రవారం మధ్యాహ్నం వ్యవసాయ పొలానికి వెళ్లి ఇంటికి స్కూటీపై వస్తుండగా అదే దారిలో తప్ప తాగిన మైకంలో ఇన్ముల్ నర్వ నుండి మితిమీరిన వేగంతో కారు నడుపుతూ ముందు వెళ్తున్న స్కూటీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో స్కూటీ పూర్తిగా ధ్వంసమై సునీత(36) అక్కడికక్కడే దుర్మరణం పాలైంది. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ పక్కనే ఉన్న పరిశ్రమ గోడ దూకి పారిపోతుండగా గ్రామ యువకులు పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. కార్ డ్రైవర్ తాగిన మత్తులో ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. గత రెండేళ్ల క్రితం సునీత భర్త జగన్మోహన్ రెడ్డి తను వ్యవసాయ పొలంలో చనిపోయారు. కుటుంబ భారం సునీత మోస్తూ వ్యవసాయ సాగు పనులు చేస్తూ ఇద్దరు కుమారులను చదివించుకుంటోంది. రోడ్డు ప్రమాదంలో సునీత ఆకాల మృతితో ఆమె ఇద్దరు కుమారులు అనాథలుగా మిగిలారు. కారు డ్రైవర్ పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ సంఘటనపై ఎఎస్ఐ శ్రీను కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు.

## సందట్లో సడేమియా

**జిహెచ్ఎంసి విలీన నేపథ్యంలో అక్రమ కట్టడాల జోరు**

**479 సర్వే నెంబర్లలో యథేచ్ఛగా షెడ్లు**

**అధికారుల పర్యవేక్షణ లోపం**



గుండ్లపోచంపల్లిలో నిబంధనలను అతిక్రమించి చేపడుతున్న కట్టడాలు

**మేడ్చల్, డిసెంబరు 19, ప్రభాతవార్త :** గుండ్ల పోచంపల్లి మున్సిపల్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు వెలుస్తున్నాయి. మున్సిపల్ పరిధి సర్వే నెంబర్ 479 లో ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నా పట్టించుకునే నాథుడే లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీలోని ప్రభుత్వ పాఠశాల వెనుకభాగంలో షెడ్ సహా పలు నిర్మాణాలు, సొంత భూముల్లోనే చేపడుతున్నప్పటికీ, వాటికి ఎటువంటి చట్టబద్ధ అనుమతులు లేవని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సొంత స్థలాల్లోనే నిర్మాణాలు జరుగుతున్నా వాటికి బిల్డింగ్ పర్మిషన్లు, లేఅవుట్ అనుమతులు లేకుండా జిహెచ్ఎంసి నిబంధనలు పూర్తిగా ఉల్లంఘిస్తూ పనులు జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అక్రమాలను పట్టించుకునే నాథుడే లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ ఇటీవల జిహెచ్ఎంసి పరిధిలో విలీనం కావడంతో, ఈ మార్పు సమయంలో ఏర్పడిన పాలనా గందరగోళాన్ని ఆసరాగా చేసుకుని, అనుమతుల్లేని నిర్మాణాలు విపరీతంగా పెరిగాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒకవైపు స్థానిక అధికారులకు స్పష్టమైన సమగ్ర ఆదేశాలు లేకపోవడం, మరోవైపు జిహెచ్ఎంసి రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ పూర్తిస్థాయిలో అమల్లోకి రాకపోవడంతో అక్రమాలకు ఆసరగా మారింది. ఈ ఖాళీ సమయాన్ని అవకాశంగా మార్చుకుని పలువురు తొందరపడి నిర్మాణాలు పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. మున్సిపాలిటీ ప్రజా ప్రతినిధుల పాలన ముగిసి ఏడాది గడిచినా, అలాగే అధికారుల పాలన ప్రారంభమై కూడా సంవత్సరం పూర్తయినా, గతంలో ప్రజా ప్రతినిధులుగా ఉన్న కొంతమంది మాజీ కౌన్సిలర్లు ఇప్పటికీ తమ హవాను

మిగతా 2లో



# పట్టణాల్లో పంతం పల్లెల్లో పలాయనం

**కమలం విచిత్ర పరిస్థితి ఇదీ..**



ఇటీవల నందిగామలో సమావేశమైన బిజెపి నేతలు

- పంచాయతీ సమరంలో పలు చోట్ల పోటీకి సాహసించని బిజెపి నేతలు
- నందిగామలో 18 చోట్ల హోరాహోరీ తలబడిన కాగ్రెస్, బిఆర్‌ఎస్
- ఒకే ఒక చోట నామినేషన్ వేసిన బిజెపి
- అంతలోనే ఉపసంహరించుకుని బిఆర్‌ఎస్‌కు మద్దతు పలికిన రాములు
- సిడితండాలో కాంగ్రెస్‌కు జైకొట్టిన బిజెపి నేత మోహన్ సింగ్
- బిజెపి నేతలు పూనుకున్న రెండు చోట్లా అభ్యర్థులు పరాజయం
- పట్టణాలకే పరిమితమవుతున్న కాషాయం పెద్దలు
- గ్రామాల్లో చతికిలపడుతున్న వైనం
- వచ్చే జెడ్పీ,మండల పరిషత్ ఎన్నికల్లోనైనా బలం పెంచుకోవాలని కోరుతున్న కార్యకర్తలు

**నందిగామ, డిసెంబరు 19, ప్రభాతవార్త :** దక్షిణాది రాష్ట్రాలలో విస్తరించటంతోపాటు అధికార పగ్గాలు చేపట్టటమే లక్ష్యంగా బిజెపి అధిష్టానం కృషి చేస్తుంటే .. క్షేత్రస్థాయిలో ఆ పార్టీ నేతలు ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. రాష్ట్ర నాయత్వం ఒక పక్క రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ.. అధికారపార్టీ నేతలపై విమర్శనాస్త్రాలు సంధిస్తోంది. జిల్లాల్లో కూడా బిజెపి నేతలు ఆ దిశగా సమాయత్తమవ్వాలని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిస్తోంది. పదే పదే వివిధ దశల్లో జిల్లా నేతలతో సమావేశాలు నిర్వహిస్తూ వారిలో చైతన్యం నింపడానికి అన్ని విధాల ప్రయత్నిస్తోంది. కేంద్ర ప్రభుత్వం గ్రామీణుల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, తద్వారా గ్రామాల్లో బిజెపిని బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేయాలని ఆ పార్టీ హై కమాండ్ ఇచ్చిన ఆదేశాలను ఎవరూ పట్టించుకోవటంలేదు. గ్రామాల్లో పార్టీ వేళ్లానుకునేలా చేస్తున్న ప్రయత్నాలు జీరో అనే చెప్పాలి. అవకాశం వచ్చినప్పుడు కూడా తమ బలాన్ని నిరూపించుకోవటంలో విఫలమవుతున్నారు. నందిగామ మండలంలో ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికలను పరిశీలిస్తే బిజెపి వైఫల్యాలు స్పష్టంగా కనిపించాయి. మండలంలో 19 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో ఒక పంచాయతీ ఏకగ్రీవమైంది. మిగిలిన 18 పంచాయతీలలోనూ కాంగ్రెస్, బిఆర్‌ఎస్ అభ్యర్థులు హోరాహోరీ పోటీపడ్డారు. ఇది కాక... బిఆర్‌ఎస్ నుంచి మరో ఐదుగురు రెబల్ అభ్యర్థులు పోటీ చేశారు. అయితే రాష్ట్రవ్యాప్తంగా పుంజుకుంటున్నామని ప్రగల్భాలు పలుకుతున్న బిజెపి నుంచి మాత్రం మండలవ్యాప్తంగా ఒకే ఒక పంచాయతీలో నామినేషన్ దాఖలు చేయటం చర్చనీయాంసమైంది. నందిగామలో సర్పంచ్ అభ్యర్థిగా సీనియర్ బిజెపి నేత ఎర్రగారి రాములు నామినేషన్ దాఖలు చేసి అంతలోనే ఆయన కూడా వెనక్కు తగ్గడంతో బిజెపి కార్యకర్తల్లో తీవ్ర నైరాశ్యం నెలకొంది. పైకి ఉప్పు నిప్పుగా బిజెపి, బిఆర్‌ఎస్ కనిపిస్తుండగా.. రాములు బిఆర్‌ఎస్ బలపరిచిన కొమ్ము వెంకటయ్యకు మద్దతు పలకటం కమలదళానికి విస్మయం కలిగించింది. అదేవిధంగా సిడితండాలో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి గెలుపు కోసం నియోజకవర్గం బిజెపి గిరిజన నాయకుడు మోహన్ సింగ్ పనిచేయడం.. అయినా కాంగ్రెస్ అభ్యర్థి పరాజయం పాలవడం చూస్తే ఓటర్లలో బిజెపి నేతల ప్రాబల్యం ఎంతవరకూ ఉందో అర్థమవుతోందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. సిడితండాలో కాంగ్రెస్ నుంచే మరో రెబల్ అభ్యర్థి జి.చవాన్ గట్టి పోటీ ఇచ్చి 318 ఓట్లకు పైగా మెజార్టీతో గెలుపొందటం గమనార్హం.

నర్సప్పగూడలో బిజెపికి సుమారు 500కు పైగా సానుభూతిపరులు ఉన్నారని అంచనా. గతంలో జరిగిన ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో నర్సప్ప గూడ నుండి బిజెపికి భారీ మెజార్టీ ఇచ్చిన ఓటర్లు ఈ సారి ఆ పార్టీ నుంచీ అభ్యర్థులు పోటీలో లేకపోవడంతోనే వేరొక అభ్యర్థికి జై కొట్టారని కమలదళం పేర్కొంటోంది. ఈ విధంగా వెనకబాటు ధోరణిని విడనాడి వచ్చే మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలలో అయినా బిజెపి బలం నిరూపించే అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ కార్యాకర్తలు కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్‌కమిటి ఛైర్మన్ బిఎస్ ఆంజనేయులు

## సర్పంచ్‌లు అవినీతిరహిత పాలన అందించాలి

**కుల్కచర్ల, డిసెంబరు 19 ప్రభాతవార్త :** కుల్కచర్ల మండలంలోని జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికలో గ్రామాలల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించిన కుల్కచర్ల మండల ప్రజలకు, నాయకుల, కార్యకర్తలకు, ఓటర్లకు కుల్కచర్ల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, మార్కెట్ కమిటి ఛైర్మన్ బిఎస్ ఆంజనేయులు ముదిరాజ్ ప్రత్యేక కృతజ్ఞలు తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ నూతన సర్పంచ్ చంద్రభూపాల్ రావు, ఉప సర్పంచ్ బోల్ల భవాని, మరియూ వార్డు సభ్యులను సన్మానించారు. అనంతరం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ..ప్రజల అశీర్వా దంతో గెలుపొందిన సర్పంచ్‌లు అవినితి రహిత పాలన అందిస్తూ గ్రామ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలని సూచించారు. ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి సహకరంతో గ్రామాలను, మండల అభివృద్ధికి అత్యధిక నిధులతో అభివృద్ధి చేసేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కాంగ్రెస్ గెలుపు కోసం శ్రమించిన, సహకరించిన నాయకులు, ధన్యవాదాలు తెలిపారు.

### శేరిగూడ ఎన్నికల అవకతవకలపై

## హైకోర్టులో పిటిషన్

**- జనవరి 6కు విచారణ వాయిదా**

**శంకర్‌పల్లి, డిసెంబరు 19 ప్రభాతవార్త :** శంకర్‌పల్లి మండల పరిధిలోని శేరిగూడ గ్రామంలో జరిగిన రెండవ విడత స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా చోటుచేసుకున్న అవకతవకలపై తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ మేరకు దాఖలైన డబ్ల్యూపీ నెం. 39201 / 2025 పిటిషన్‌ను హైకోర్టు విచారించి, తదుపరి విచారణను 2026 జనవరి 6వ తేదీకి వాయిదా వేసింది. ఈ కేసుకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమిషన్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది, పిటిషనర్ సమర్పించిన ప్రతినిధిత్వంపై ఇప్పటికే విచారణ ప్రారంభించామని కోర్టుకు తెలిపారు. ఇందుకు సంబంధించి సంబంధిత అధికారులకు వ్రాతపూర్వక ఆదేశాలు కూడా జారీ చేసినట్లు వివరించారు. అయితే, ఈ విచారణకు సంబంధించిన పూర్తి నివేదిక ఇంకా అందాల్సి ఉందని కోర్టుకు తెలియజేశారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకున్న గౌరవనీయ న్యాయమూర్తి టీఎండీ జస్టిస్, కేసును జనవరి 6వ తేదీన అడ్జర్న్ మోషన్ లిస్ట్‌లో లిస్ట్ చేయాలని ఆదేశించారు. విచారణ నివేదిక అందిన అనంతరం తదుపరి ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు హైకోర్టు స్పష్టం చేసింది.

### నేడు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

-ప్రభుత్వ విప్, ఎంపీ, ఎమ్మెల్యే రాక

**ఘట్‌కేసర్, డిసెంబరు 19, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో శనివారం కళ్యాణలక్ష్మి, షాదాముభారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ భీమర్తి చంద్రశేఖర్ తెలిపారు. శివారెడ్డిగూడలోని బంధన్ పంక్షన్‌హాలులో ఉదయం 10 గంటలకు కళ్యాణలక్ష్మి, షాదీముభారక్ చెక్కులను ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా లబ్దిదారులకు అందజేస్తారని చెప్పారు. మేడ్చల్ నియోజకవర్గంలోని ఘట్‌కేసర్‌కు సంబంధించి 46, మేడిపల్లి 110, కీసర 60, కాప్రా 16, మూడుచింతలపల్లి 32, మేడ్చల్ 86 చొప్పున మొత్తం 350 మంది లబ్దిదారులకు ప్రభుత్వ విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డిలు చెక్కులను పంపిణీ చేస్తారని తెలిపారు.

# శంకర్‌పల్లికి కొత్త రైళ్లు..

### మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం

**త**శంకర్‌పల్లి రైల్వే స్టేషన్‌కు మూడు కొత్త రైళ్లు మంజూర య్యాయని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం తెలిపారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలో మీడి యాతో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రయాణికుల దృష్ట్యా స్థానిక ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి చొరవతో కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరగా వెంటనే స్పందించి ( హైదరాబాద్ విజయపుర), (రాయచూర్ పర్భని), (పర్భని రాయచూర్) మూడు రైళ్ళను ఆపే విధంగా చర్యలు తీసుకున్నారు. రైతుల సౌకర్యం కొరకు రైలు క్రాసింగ్ దాటడానికి ఇబ్బందులు పడుతున్నందుకుగాను కొండకల్‌లో రైల్వే ఓవర్ బ్రిడ్జి, ఫతేపూర్‌లో 20 ఫీట్ల వెడల్పుతో అండర్ బ్రిడ్జి, గొల్లగూడ లో ఓవర్ బ్రిడ్జి, ముబారక్ పూర్ లో అండర్ బ్రిడ్జిలు మంజూరు అయ్యాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక బిజెపి



మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం

నాయకులు, ప్రయాణికులు, మండల, మున్సిపల్ ప్రజలు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. శంకర్‌పల్లి మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు అసంపూర్తి మున్సిపాలిటీ ఆదాయానికి స్థానిక ప్రజా ప్రతి నిధులు, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య గండి కొడుతున్నారని మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం ఆరో పించారు. మున్సిపాల్టీ ఆదాయంతో ఎమ్మెల్యే డ్రైవర్ జీతాలు, వాహనంలో డీజిల్ కొట్టించుకుంటు న్నారని ఆరోపించారు. మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు అసంపూర్తిగా చేసి పూర్తి బిల్లులను తీసుకున్న ఘనత గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ నాయకులకు చెల్లుతుందన్నారు. పత్తేపురం వంతెన నుంచి తీగల వాగు వరకు రైన్ వాటర్ పనులు, రైల్వే స్టేషన్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు రహదారి విస్తరణ పనులు పూర్తి చేసినట్లుగా బిల్లులు తీసుకున్నారని ఆరోపించారు. వీటన్నింటికీ ప్రజా క్షేత్రంలో సమాధానం చెప్పాలని, పూర్తి చేసిన అభివృద్ధి పనులు చూపించాలని మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బసగళ్ల రాములు గౌడ్, మండల పార్టీ అధ్యక్షురాలు లీలావతి బయానంద్, మున్సిపల్ అధ్యక్షుడు దయాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, పరమేశ్వర్ రెడ్డి, ప్రతాపరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు వాసుదేవ్ కన్నా, శ్రీనివాస్ రెడ్డి, నరసింహారెడ్డి, అనిశెట్టి సురేష్, పాండురంగం, దండు రామ్మోహన్, విటోబా, శ్రీకాంత్ రెడ్డి, వెంకటేష్, పండిత్ రావు గౌడ్ ఉన్నారు.



అయ్యప్పలకు వడ్డిస్తున్న గఫార్

## అయ్యప్పలకు ముస్లిం భక్తుడి అన్నవితరణ

**మత సామరస్యానికి ప్రతీక ఎక్మాయి..**

**తాండూరు, డిసెంబరు 19, ప్రభాతవార్త :** మత సామరస్యానికి ప్రతీకగా బషీరాబాద్ మండలం ఎక్మాయి గ్రామం నిలిచింది. ముస్లింలకు పండుగలకు హిందువులు ఇఫ్తార్ ఇవ్వడం పరిపాటిగా చూస్తుంటాం. కానీ హిందువులు ఎంతో నియమ నిష్ట తలతో చేసే అయ్యప్ప స్వాములకు ముస్లింలు అన్నవితరణ చేయడం చాలా అరుదు. గత కొంత కాలంగా ఎక్మాయి గ్రామానికి చెందిన గఫార్ ఈ కార్యక్రమాన్ని చేపట్టడం పట్ల గ్రామస్తులు అభినందిస్తున్నారు. శుక్రవారం ఎక్మాయిలోని పదునెట్టంబడి అయ్యప్ప ఆశ్రమంలో అన్నవితరణ కార్యక్రమం నిర్వహించారు. నిరుడు బషీరాబాద్ మండల కేంద్రంలో కూడా ఇలాంటి కార్యక్రమాలను చేపట్టారు. సాధారణ రైతు కుటుంబానికి చెందిన గఫార్ అనునిత్యం తమతో కలిసిమెలిసి ఉంటారని గ్రామస్తులు తెలిపారు. మేమంతా అన్నదమ్ము వలె జీవిస్తున్నామని గఫార్ చెప్పారు. తమ మధ్య ఏనాడూ మతాల గురించి ప్రస్తావన రాలేదన్నారు. సమాజంలో మంచి కార్యక్రమాలు చేసేందుకు మతం అడ్డురాదని వ్యాఖ్యానించారు.

## శాంక్టమ్ హోమ్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

**శంకర్‌పల్లి, డిసెంబరు 19, ప్రభాతవార్త :** శాంక్టమ్ హోమ్స్ యాజమాన్యంపై కార్మిక శాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. శంకర్ పల్లి పట్టణ కేంద్రంలో శాంక్టమ్ అపార్ట్మెంట్స్ హోమ్స్ వద్ద జరిగిన ప్రమాదంలో పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన వలస కార్మికుడు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సిఐటియు నాయకులు ప్రమాదం జరిగిన ప్రదేశానికి వెళ్లి కార్మికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ మాట్లాడుతూ చనిపోయిన కార్మికుడి కుటుంబానికి 50 లక్షలు ఎక్స్రేషియా చెల్లించాలని, శాంక్టమ్ హోమ్స్ కార్మికుల రక్షణకోసం హెల్మెట్స్, సేఫ్టీ బెల్ట్, ఇతర పరికరాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల ప్రమాదం జరిగిందన్నారు. ప్రమాదం ఎలా జరిగింది అనే విషయంలో కార్మిక శాఖ అధికారులు వెంటనే విచారణ చేపట్టి శాంక్టమ్ హోమ్స్ యాజమాన్యంపై కార్మిక చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకొని మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని కార్మిక శాఖ అధికారులను డిమాండ్ చేశారు. శంకర్ పల్లి, మోకిలా పరిధి



సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందం

లోని అపార్ట్మెంట్స్ విల్లాస్ యాజమాన్యాలు 1979 అంతర్రాష్ట వలస కార్మిక చట్టానికి విరుద్ధంగా కార్మికులతో పని చేయిస్తూ వారికి ఎలాంటి భద్రత లేదని అన్నారు. మోకిలా శంకర్పల్లి పరిధిలో అనేక ప్రమాదాలు జరిగిన కార్మిక శాఖ అధికారులు ప్రభుత్వాధికారులకు చీమకుట్టినట్లయిన లేకపోవడం సరైనది వెంటనే కార్మిక శాఖ అధికారుల స్పందించి శాంక్టమ్ హోమ్స్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిఐటియు శంకర్పల్లి మండల కన్వీనర్ బోద మల్లేష్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు ఆస్పత్రి ముందు రోగి బంధువుల ఆందోళన





ఆస్పత్రి ముందు ఆందోళన చేస్తున్న రోగి బంధువులు

**మేడ్చల్, డిసెంబరు 19, ప్రభాతవార్త :** ఎల్లంపేట మున్సిపాలిటిలోని ఆస్పత్రి ఎదుట రోగి బంధువులు ఆందోళన చేపట్టిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం శామీర్‌పేట మండలంలోని అల్యాబాద్ గ్రామానికి చెందిన పుష్పలత (40) అనారోగ్యంతో మెడిసిటి ఆస్పత్రికి రాగ ఆమెకు అర్నియా ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. దీంతో ఆమె ఆరోగ్య శ్రీ పథకం కింద ఆపరేషన్ చేయించుకోవడానికి ఈ నెల 17న అస్పత్రిలో చేరింది. అన్ని పరీక్షలు చేసిన వైద్యులు గురువారం ఆమెకు ఆపరేషన్ చేయడానికి పూనుకోగా ఆమె కడుపులోని ప్రేగుల్లో ఇన్‌ఫెక్షన్ ఉన్నట్లు గుర్తించారు. సమస్య జటిలంగా ఉండటంతో ఆమెను నగరంలోని ఉస్మానియా అస్పత్రికి తరలించాలని రోగి బంధువులకు సూచించారు. దీంతో వారు శుక్రవారం వరకు వేచి ఉండి ఆస్పత్రి ముందు బైటాయించి వైద్యులు నిర్లక్ష్యంతోనే ఆపరేషన్‌ను మధ్యలోనే ఆపివేశారని ఆందోళన చేశారు. ఆస్పత్రి యాజమాన్యం కల్పించుకుని ఆమెకు ఉన్న ఇన్‌ఫెక్షన్‌కు గ్యాస్ట్రో సర్జన్ అవసరమని, అందుకు ఆమెను ఉస్మానియాకు తరలించాలని అందుకు తగిన పూర్తి సహకారం అందిస్తామని చెప్పడంతో వారు ఆందోళన విరమించారు. అనంతరం ఆమెను ఆస్పత్రి వారు తమ అంబులెన్స్‌లో వైద్యుల పర్యవేక్షణలో ఉస్మానియాకు తరలించారు.

## నాణ్యతగా పనులు చేపట్టాలి

**-జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్**

**వికారాబాద్, డిసెంబరు 19, ప్రభాతవార్త :** జిల్లా పరిషత్ భవన నిర్మాణ ప నులు నాణ్యవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా పరిషత్ భవన నిర్మాణ ప నుల ౹ జిల్లా అదనపు కలెక్టర్, జెడ్పి సీఈవో సుధీర్ తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సంద ర్భంగా జెడ్పీ సమావేశ మందిరం, ఛైర్మన్, సీఈఓ ఛాంబర్ లతో పాటు వివిధ సదుపాయాల ఏర్పాట్ల ౹ కలెక్టర్ పరిశీలించారు. జెడ్పిఆవరణలో ఆహ్లాదంగా ఉండేవిధంగా పచ్చదనం కలిగి ఉండే లా చెట్ల ౹ నాటాలని అధికారులకు సూచించారు. కలెక్టర్‌తో పాటు పంచాయత్‌రాజ్ ఎగ్జిక్యూటివ్



జడ్పీ భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

## అన్ని రోజుల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ ఆకస్మిక తనిఖీలు

**: ట్రాఫిక్ డిసిపి రాహుల్ హెగ్డే**

**జూబ్లీహిల్స్, డిసెంబరు 19, ప్రభాతవార్త:** నయాసాల్ వేడుకల నేపథ్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే తెలిపారు. గురువారం రాత్రి పశ్చిమ మండలంలోని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లోని ఏడు ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు వంద మంది అధికారులు సిబ్బందితో అర్ధరాత్రి వరకు ఈ తనిఖీల ను ఒకే సమయంలో కొనసాగించారు. మద్యం సేవించి వాహ నాలు నడుపుతున్న 54 మంది వాహనదారులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వీరి నుంచి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడు తూ.. రానున్న కొత్త సంవత్సరం వేడుకల నేపథ్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. వారాంతాల్లో కాకుండా అన్ని రోజుల్లో ఏదో ఒక సమయంలో ఈ తనిఖీలను కొనసాగిస్తామన్నారు. మద్యం సేవించి వాహ నాలు నడపవద్దని సూచించారు. ఉదయం వేళలో సైతం ఆకస్మిక తనిఖీలు



జూబ్లీహిల్స్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో డీసీపీ రాహుల్ హెగ్డే, పశ్చిమ మండల ఏసీపీ కట్టా హరిప్రసాద్.

నిర్వహిస్తామన్నారు. పబ్బులు, క్లబ్బులు, హోటళ్లు, ఇతర వేడుకలకు సంబంధించి అనుమతులు ఉండా లని, అందుకు సంబంధించి పార్కింగ్ సౌకర్యం సైతం కల్పిం చాలని సూచించారు. పార్కింగ్ సౌకర్యం లేని హోటళ్లకు నో టీసులు సైతం జారీ చేస్తామన్నారు. శుక్రవారం రాత్రి నిర్వ హించిన తనిఖీల్లో పశ్చిమ మండల ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరి ప్రసాద్ పలువురు ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

## సమాజంలో దోపిడీవర్గాల కుటిలతంత్రాన్ని ఎండగట్టిన కోహినూర్ నాటకం



సందేశాత్మక కోహినూర్ నాటకంలో ఒక దృశ్యం

**రవీంద్రభారతి, డిసెంబరు 19 ప్రభాతవార్త :** సమాజంలోని దోపిడీ వర్గాలు అనుసరించే కుటిల తంత్రాన్ని ఎండగడుతూ నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం లోని డా. నందమూరి తారక రామారావు కళావేదికలో శుక్రవారం రాత్రి అద్భుతంగా ప్రదర్శింపబడిన సందేశాత్మక నాటకం కోహినూర్. స్వార్థపరశక్తులు తమ వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాల కోసం లేని సమస్యలను సృష్టించి, భావోద్వేగాలను రెచ్చగొట్టి సామాన్య ప్రజలను ఆందోళనల బాటపట్టిస్తారు. వాస్తవాలను గ్రహించలేక అమాయక ప్రజలు వారిచేతుల్లో పావులుగామారి చివరికి బలి పశులవుతారు. ఇలాంటి కపట ఉద్యమాల వెనుకవున్న అసలు ఉద్దేశాలను గుర్తించి, ప్రజలు విచక్షణతో వ్యవహరించాలని, స్వార్థపరుల వలలో పడకుండా అప్రమత్తంగా ఉండాలనే సందేశాత్మక కథాంశంతో ఈ నాటిక బలమైన హెచ్చరికను జారీచేస్తుంది. ప్రముఖ నాటక రచయిత, నటుడు జమ్మలమడక శశిమోహన్ రచన, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, ఉస్మానియా విశ్వ విద్యాలయాల నుండి నాటక కళల్లో పట్టాలుపొంది గత 40ఏళ్లలో 50నాటకాలకు దర్శకత్వం, 50నాటకాల రచన, 25నాటకాల్లో నటించిన సమ్మెట వెంకటరమణ దర్శకత్వం లో, వినూత్న పద్ధతులతో సామాజిక స్పృహ, వ్యక్తిత్వ వికా సాన్ని పెంపొందిస్తున్న సెంటర్ ఫర్ ఆర్ట్స్, మీడియా అండ్ సోషల్ వెల్ఫేర్ సంస్థ ఆధ్వర్యంలో, ప్రాజెక్ట్ డిజైన్ డా. అల్తాఫ్ హసన్ పర్యవేక్షణలో కోహినూర్ నాటకం ప్రదర్శింపబడి ఆశీనులైన అశేష నాటకప్రియులు, ఔత్సాహిక ప్రేక్షకుల ప్రశం సలు, మన్ననలు పొందింది. ప్రదర్శనానంతరం అతిథులు కళా కారులు, సాంకేతికవర్గాన్ని ఘనంగా సత్కరించి అభినందించారు.

## సందట్లో సడేమియా

(మొదటి పేజీ తరువాయి)

కొనసాగించటం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని స్థానికంగా చర్చించుకుంటున్నారు. అధికారిక హోదా లేకున్నా, తమ మాటే చట్టంలా వ్యవహరిస్తూ, ఇతరులకు అనుమతుల విషయంలో సహాయం చేస్తున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా తమ స్థలాల్లోనే ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఇదేచ్ఛగా నిర్మాణాలు చేపడుతూ, ఇతరులకు కూడా ఇదే మార్గం చూపిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. దీంతో అనుమతుల్లేని నిర్మాణాలకు ఒక రకమైన అప్రకటిత రక్షణ వలయం ఏర్పడిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక అక్రమ నిర్మాణాలపై ప్రశ్నించేందుకు అధికారులు వెళ్లినప్పుడు, ఏదో ఒక వంకతో వారిని బ్లాక్ మెయిల్ చేస్తున్నారని కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంకా తాము కౌన్సిలర్లమని చెప్పుకుంటూ, అధికారులపై ఒత్తిడి తెచ్చి చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. అక్రమ నిర్మాణాల విషయంలో మున్సిపల్ కమిషనర్ తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని, మాజీ ప్రజా ప్రతినిదులతో కుమ్మక్కై నిమ్మకునీరెత్తినట్లు నడుచుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ మొత్తం పరిణామాలతో గుండ్ల పోచంపల్లిలో పాలనా వ్యవస్థపై ప్రజల విశ్వాసం దెబ్బతింటోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి, అనుమతుల్లేని నిర్మాణాలను తక్షణమే నిలిపివేసి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## మడికట్టు చిన్నారుల అద్భుత నృత్య ప్రదర్శన

### రవీంద్ర భారతిలో జగన్ మాస్టర్ ఘన విజయం

**చేవెళ్ల, డిసెంబరు 19, ప్రభాతవార్త:** చేవెళ్ల మండలంలోని మడికట్టు గ్రామానికి చెందిన ధర్మసాగర్ జగన్ మధ్యతరగతి కుటుంబానికి చెందిన యువకుడు. పెద్దగా ఆర్థిక వనరులు లేకపోయినా, చిన్నప్పటి నుంచే డాన్స్‌పై అపారమైన ఆసక్తిని పెంచుకున్నాడు. డాన్స్ మాస్టర్ కావాలనే ఆశతో నిరంతరం కష్టపడి సాధన చేసిన జగన్ యొక్క కల ఈ రోజు సాకారమైంది. హైదరాబాద్‌లోని ప్రతిష్టాత్మక రవీంద్ర భారతి డాన్స్ అకాడమీ నిర్వహించిన పోటీలలో, మొత్తం 10 గ్రూపులపై పోటీ పడి, జగన్ మాస్టర్ తన ఆధ్వర్యంలోని 45 మంది చిన్నారుల బృందంతో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చి ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన తంగడపల్లి మడికట్టు గ్రామ సర్పంచ్ పామేనా రాములు గారు, జగన్ మాస్టర్‌ను శాలువతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో డీపీటీ న్యాలట గోవర్ధన్, కంకంటి మల్లేష్, రామస్వామి బల్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, న్యాలట అశోక్, జె శ్రీనివాస్ రెడ్డి, భూపాల్, గణేష్, యాదగిరి, తదితరులు పాల్గొని తమకు శుభాకాంక్షలు తెలియజేశారు. మధ్యతరగతి నేపథ్యం నుంచి వచ్చి కష్టపడి తన లక్ష్యాన్ని







చేరుకున్న జగన్ మాస్టర్ విజయం నేటి యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని గ్రామస్తులు, శ్రేయోభిలాషులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

## తాండూరులో 'కొను'గోల్‌మాల్

(మొదటి పేజీ తరువాయి)

మున్సిపల్ ఆఫీసుపై దాడులు జరిపిన నేపథ్యంలో కెమెరాలను అమర్చుకున్నారని మరో వాదనలు వినబడుతున్నాయి. ఏసీబీ అధికారుల రాకను కెమెరాల ద్వారా ముందుగానే పసిగట్టవచ్చని అనుకుంటున్నారు. ఏది ఏమైనా ప్రజాధనం దుబారాపై అన్నివర్గాల ప్రజల నుంచి వ్యతిరేక స్వరం వినిపిస్తోంది.

**కమిషనర్ యాదగిరి వివరణ :**

"ఆఫీసులో 28 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. వాటికి రూ.4.50 లక్షల వరకు వెచ్చించాం. నాణ్యమైన పరికరాలను అమర్చాం. అందుకే వాటి ధరలు కాస్త ఎక్కువగా ఉన్నాయి. ఉద్యోగులు సవ్యంగా పనిచేస్తున్నారా, లేదా తెలుసుకునేందుకు వీలవుతుంది. ఆఫీసు చుట్టూ విలువైన యంత్ర సామగ్రి ఉన్నందున తరచూ కెమెరాల ద్వారా చూసుకోవచ్చు. ఎవరైనా అక్రమంగా చొరబడినా కెమెరాలు పట్టిస్తాయనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేశాం. వార్డుల సమస్యలపై ప్రజలు నేరుగా ఆయా నెంబర్లకు కాల్ చేసి పరిష్కరించుకోవచ్చు. వార్డు అధికారులు, శానిటరీ సిబ్బంది, వీధి దీపాలు, మంచినీటి సరఫరా సిబ్బంది వివరాలు ఆ పట్టికలో ఉన్నాయి. ఈ వ్యవహారంలో ఎలాంటి దుబారా, దుర్వినియోగం జరుగలేదని నా అభిప్రాయం"

## సన్నకారు రైతులకు యూరియా ఇచ్చేది ఒకసారే

**తలకొండపల్లి డిసెంబర్ 19, ప్రభాతవార్త:** చిన్న, సన్నకారు రైతులకు ఒకేసారి యూరియా అందజేస్తామని, పెద్ద రైతులకు మూడు దఫాలుగా తీసుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి రేణుక చక్రవర్తి స్పష్టంచేశారు. యూరియా కావలసిన రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు వివరాలతో ముందుగా యాప్‌లో బుక్ చేసుకోవాలని సూచించారు. ఈనెల 20 నుంచి ఈ సౌకర్యం అందుబాటులోకి వస్తుందన్నారు. వ్యాపార సంస్థల్లో యూరియా నిల్వల వివరాలు నమోదు అవుతున్నందున కావలసిన షాపు నుంచి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోపరుచుకోవాలని ఆమె పేర్కొన్నారు.

## మెగా లోకదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

**కొందుర్గు, డిసెంబరు 19, ప్రభాతవార్త :** షాద్నగర్ కోర్ట్ ఆవరణలో ఈనెల 21వ తేదీన నిర్వహిస్తున్న జాతీయ మేఘ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని కక్షి దారులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ ఎల్. రవీంద్ర నాయక్ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జాతీయ మెగా లోక్ అదాలత్ ద్వారా ఇరువైపులా సమ్మతితో సమస్యలు పరిష్కరించుకునే అవకాశం అందుబాటులోకి వచ్చిందన్నారు. రాజీ చేసుకునే అవకాశం ఉన్న క్రిమినల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన కేసులు, కుటుంబ సమస్యల సంబం దించిన కేసులు, డ్రంకెన్ అండ్ డ్రైవ్, మోటార్ వాహన చట్టాల ఉల్లం ఘన కేసులు, చెక్ బోన్, బ్యాంక్ రికవరీ, విద్యుత్ చౌర్యము తదిర కేసులని పరిష్కారం చేసుకోవచ్చని వివరించారు. కక్షలు పెంచుకొని కోర్టు చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృధా చేసుకోవద్దని సూచించారు. రాజీమార్గమే రాజా మార్గమన్న సామెతను ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలని కోరారు. న్యాయశాఖ అందిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రూ.75 వేలు కాజేసిన పగటి దొంగ



బాధితుడు షాపోద్దీన్

**వికారాబాద్, డిసెంబరు 19, ప్రభాతవార్త :** బ్యాంకు నుంచి డబ్బులు డ్రా చేసుకుని వెళ్తుండగా, ద్వి చక్ర వాహనంలోంచి రూ.75 వేలు పగటి దొంగ దోచుకున్నాడు. ఈ సంఘటన వికారాబాద్ పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ మండలం మదన్‌పల్లి గ్రామానికి చెందిన షాపోద్దీన్ అనే రైతు కూలీ పట్టణంలోని కెనెరా బ్యాంకులో దాచుకున్న రూ.75 వేలు వ్యవసాయ పనుల నిమిత్తం డ్రా చేశాడు. డ్రా చేసిన డబ్బులు అతని స్కూటీ డిక్కీలో పెట్టుకుని స్వగ్రామానికి బయల్దేరాడు. పట్టణంలోని రైతు బజారు సమీపంలోకి వెళ్ళి చూడగా, స్కూటీ డిక్కీలో ఉంచిన డబ్బులు దొంగలించబడ్డాయి. స్కూటీ డిక్కీ తాళం సైతం ఓపెన్ చేసి ఉండటంతో డబ్బులు ఉన్నాయో..లేదో అనే అనుమానంతో తెరచి చూడగా, డబ్బులు గుర్తు తెలియని దొంగ దోచేశాడని రైతు షాపోద్దీన్ లబోదిబోమన్నాడు. ఈ విషయమై వికారాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు తెలిపారు.

**కారు షెడ్‌లోకి దూసుకెళ్లి తండ్రి కొడుకు మృతి చెందిన కేసులో**

## డ్రైవర్,కారు యజమాని అరెస్ట్

**మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబరు 19 ప్రభాతవార్త :** ఇన్నోవా కారు స్వెట్టర్ షెడ్‌లోకి దూసుకెళ్లటంతో కొడుకు, తండ్రి మృతి చెందిన సంఘటనలో మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు శుక్రవారం కారు డ్రైవర్, యజమానిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కథనం ప్రకారం....మధ్యప్రదేశ్‌కు చెందిన ప్రభు మహారాజ్ (50) తన కొడుకులైన సాధునాద్ (22). దీపక్ (19)లతో కలిసి మైలార్‌దేవ్‌పల్లిలోని దుర్గానగర్‌లో షెడ్ ఏర్పాటు చేసుకుని స్వెటర్లు విక్రయించి రాత్రివేళల్లో షెడ్‌లోనే ముగ్గురు పడుకుంటారు..కాగా బుధవారం తెల్లవారు జామున సంతోష్‌నగర్‌కు చెందిన విద్యార్థి సయ్యద్ హుస్సేన్ (19) కారు నడుపుతూ అతని నలుగురు స్నేహితులతో కలిసి కాటేదాన్ నుంచి దుర్గానగర్ వైపు వెళుతున్నారు. అదుపు తప్పిన కారు స్వెటర్ షెడ్‌లోకి దూసుకెళ్లటంతో తండ్రి ప్రభు మహారాజ్ (50).

చిన్న కుమారుడు దీపక్ (22)లు మృతి చెందారు. ప్రమాదానికి కారుకుడైన కారు డ్రైవర్ సయ్యద్ హుస్సేన్, కారు యజమాని ఉమ్మర్‌ను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### జాతీయ మెగా లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి : బాలానగర్ ఎసిపి

**సంజీవరెడ్డినగర్, డిసెంబరు 19, ప్రభాతవార్త:** ఈ నెల 21న జరగనున్న జాతీయ మెగా లోక్అ దాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని బాలానగర్ డివిజన్ ఏసీపీ పింగిలి నరేష్ రెడ్డి కోరారు. జాతీయ మెగా లోక్ అదాలత్ ద్వారా త్వరితగతిన, ఇరువైపుల సమ్మతితో సమస్య లను పరిష్కరించుకునే అవకాశం అందుబాటులో ఉందన్నారు. రాజీ చేసుకునే అవకాశమున్న వివిధ రకాల కేసులు క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన కేసులు, వైవాహిక జీవితం, కుటుంబ సమస్యలకు సంబంధించిన కేసులు, డ్రంకన్ డ్రైవ్, మోటారు వాహ న చట్ట ఉల్లంఘనలు, చెక్ బౌన్స్ కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం తదితర కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. న్యాయశాఖ అందిస్తున్న ఈ అవకాశాన్ని అర్హులంతా వినియోగించుకోవాలని ఆయన కోరారు.

## బిజెపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌ను కలిసిన సేనాపతి అజిత్ కుమార్

**శేరిలింగంపల్లి, డిసెంబర్ 19 ప్రభాతవార్త**

బీజేపీ జాతీయ వర్కిం గ్ ప్రెసిడెంట్ నితిన్ నబీన్ సారథ్యంలో భారతీయ జనతాపార్టీ మరింత బలోపేతమవు తోందని శేరిలింగంపల్లి నియోజకవర్గ బీజేపీ నేత సేనాపతి అజిత్‌కుమార్ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ బీజేపీ నేత సేనాపతి అజిత్ కుమార్ న్యూఢిల్లీలోని బీజేపీ కార్యాల యంలో బీజేపీ జాతీయ వర్కింగ్‌ప్రెసిడెంట్ నితిన్ నబిన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీజేపీ నేత అజిత్‌కుమార్ మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో బీజేపీ నితిన్ నబీన్ నాయకత్వంలో బలోపేతమవుతుందన్నారు. క్యాబినెట్ మంత్రిగాను, ఎమ్మెల్యేగాను పనిచేయటమే కాకుండా పార్టీ కార్యకర్తలకు నిజమైన ప్రేరణగా నిలిచిన నితిన్ నబీన్ మార్గదర్శకత్వంలో పనిచేసేందుకు సన్నద్ధంగా ఉన్నామన్నారు.



అయ్యప్ప స్వామి దేవాలయంలో పూజలు చేసిన వంకాయల రమ నారాయణరెడ్డి దంపతులు.

## హరిహర సుతుని ఆశీర్వాదంతో అందరికి మంచి జరగాలి

**అయ్యప్ప దేవాలయంలో పూజలు చేసిన మాజీ ఎంఎంసి చైర్మన్ నారాయణరెడ్డి**

**నందిగామ, డిసెంబరు19, ప్రభాతవార్త:** నందిగామ మండల కేంద్రంలో ఉన్న శ్రీఅయ్యప్పస్వామి దేవాలయంలో శుక్రవారం షాద్నగర్ ఎఎంసి మాజీ చైర్మన్ వంకాయల నారాయణరెడ్డి పూజలు చేశారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ హరిహర పుత్రుడు అయ్యప్ప ఆశీర్వాదంతో ప్రతి ఒక్కరికి మంచి జరగాలని భగవంతుని వేడుకున్నారు. అనంతరం స్వాములకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ పూజల్లో వంకాయల రమ, వంకాయల వినయ్ కుమార్ రెడ్డి, జిల్లెల్ల బాల్ రెడ్డి ,అశోక్ గౌడ్, కుమార్ గౌడ్, హరిజీవన్, తుమ్మల నర్సింలు, చించోటి కృష్ణ గౌడ్, వడ్ల రమేష్,

## పాలకులుగా కాకుండా సేవకులుగా పనిచేయాలి

**కాంగ్రెస్ సీనియర్ నేత జిల్లెల్ల బాల్ రెడ్డి**



సర్పంచులను సన్మానించిన కాంగ్రెస్ నేత జిల్లెల్ల బాల్ రెడ్డి

**నందిగామ, డిసెంబరు19, ప్రభాతవార్త:** ప్రజా సేవ చేసే భాగ్యం లభించడం అదృష్టమని,నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి పాల కులుగా కాకుండా సేవకులుగా పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని నందిగామ కాంగ్రెస్ సీనియర్ నేత జిల్లెల్ల బాల్రెడ్డి కొత్త సర్పం చులకు సూచించారు. నందిగామ మండల కేంద్రంలో శుక్రవారం కొత్తగా గెలిచిన నాందారు ఖాన్ పేట సర్పంచ్ పొన్న కృష్ణ రెడ్డి, నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ,వార్డ్ సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ నర్సింలు, దాముర్లపల్లి పొన్న సందీప్ రెడ్డి, పొన్న మాధవరెడ్డి, వార్డు సభ్యులు శివగల్ల సురేష్, బొమ్మగల నర్సింలు, అగ్గి సూరి,శ్రీకాంత్ గౌడ్, బి జంగయ్య గౌడ్, తుమ్మల నరసింహులు,శివ్వగల్ల సుమన్ ,బి రామిరెడ్డి,బి లింగం, పిట్టల రాములు,నాన్నగారి అంజయ్య, కావలి నర్సింలు, శివగల్లసతీష్, నరేందర్ రెడ్డి తదితరులు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

**కేశంపేట, డిసెంబరు19, ప్రభాతవార్త:** కేశంపేట మండల పరిధిలోని కంకర్రాల తండా కు చెందిన వాడకవత్ మాన్య నాయక్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు భాస్కర్ నాయక్ విషయాన్ని కేశంపేట తాజా మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ అంత్యక్రియల నిమిత్తం భాస్కర్ నాయక్ ద్వారా రూ.5 వేలను అందజేశారు.

## పారదర్శకతతో యూరియా పంపిణీ కొత్త మొబైల్ యాప్ ప్రవేశపెట్టిన ప్రభుత్వం

**షాబాద్, డిసెంబరు 19, ప్రభాతవార్త:** రైతులకు యూరియా



యూరియా యాప్ పై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి దండం జయచంద్ర

పంపిణీలో పారదర్శకత కోసం ప్రభుత్వం కొత్త మొబైల్ యాప్ ప్రవేశపెట్టనున్నట్లు మండల వ్యవసాయ అధికారి దండం విజయచంద్ర అన్నారు. షాబాద్ మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం రైతులకు మొబైల్ యాప్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ.. యూరియా కోసం రైతులు గంటల తరబడి క్యూలో వేచి ఉండాల్సిన అవసరం లేకుండా ఇంటి నుంచే యాప్ ద్వారా బుక్ చేసుకోవచ్చు అని వెల్లడించారు. ఈ యాప్ లో రైతులు, అధికారులు, డీలర్ల కోసం వేర్వేరు లాగిన్ ఆప్షన్లు ఉంటాయని రైతులు తమ మొబైల్ నెంబర్ ఓటిపి ద్వారా లాగిన్ కావచ్చు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల వారీగా అందుబాటులో ఉన్న యూరియా స్టాక్ వివరాలు నేరుగా తెలుసుకోవచ్చని తెలిపారు. రైతులకు తమ పట్టాదారు పాస్ పుస్తకం నంబరు, సాగు చేస్తున్న పంట వివరాలు, విస్తీర్ణం నమోదు చేసి యూరియాను బుక్ చేసుకుంటే సరిపోతుంది అన్నారు, సొంత భూమిలేని కౌలు రైతులు కూడా తమ ఆధార్ నెంబరు, భూ యజమాని ధ్రువీకరణ ఓటిపి ద్వారా యూరియా బుక్ చేసుకోవచ్చన్నారు. ఈ యాప్ డిసెంబర్ 20 నుంచి ప్రయోగాత్మకంగా ప్రభుత్వం అందుబాటులోకి తెస్తుందన్నారు. జిల్లాలో సోమవారం నుండి ఈ ఫర్టిలైజర్ మొబైల్ యాప్ అందుబాటులోకి వస్తుందని, రైతులందరూ డీలర్ల షాప్ వద్ద, వ్యవసాయ విస్తరణ అధికారులు, వాలెంటర్ల ద్వారా మొబైల్ యాప్ గురించి తెలుసుకొని అవసరం ఉన్న రైతులు యూరియా బుక్ తీసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

### యూరియ బుకింగ్‌కు సమయం

## కేవలం 24 గంటలు

**...రైతులు యూరియ బుకింగ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి**

**..మండల వ్యవసాయ అధికారి పవన్ ప్రీతమ్**

**పెద్దేముల్, డిసెంబరు 19, ప్రభాతవార్త:** రైతులు యూరియ బుకింగ్ యాప్ కోసం ఫర్టిలైజర్ బుకింగ్ యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పవన్‌ప్రీతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పవన్ ప్రీతమ్ మాట్లాడుతూ రైతులు తమ మొబైల్ నెంబర్‌ను ఉపయోగించి యూరియ బుకింగ్ అప్లికేషన్‌లో సులభంగా లాగిన్ అవ్వవచ్చని అన్నారు. యూరియ బుకింగ్ చేయడానికి పట్టా భూ యజమానులు నాన్ పట్టారైతులు, కౌలుదారులు అర్హులని అన్నారు. రైతుల పాస్‌పుస్తకంతో లింకు చేయబడిన మొబైల్ నంబర్‌కు ఓటిపి పంపబడుతుందని అన్నారు.రైతులు యూరియబ్యాగులను బుక్ చేసుకున్న తరువాత మీ రిఫరెన్స్ కోసం ఒక ప్రత్యేకమైన బుకింగ్ ఐడి రూపొందించబడుతుందని అన్నారు. బుకింగ్ కేవలం 24 గంటలుమాత్రమే ఉంటుందని, ఆ తరువాత ఉపయోగించపకపోతే స్టాకు సిస్టమ్‌లోకి విడుదల చేయడానికి గడువు ముగుస్తుందని అన్నారు. ఎటువంటి సహాయసమాచారం కోసం మండలంలోని క్లస్టర్‌లో ఏఈఓను కాని ఎఓను కాని సంప్రదించాలని అన్నారు.

## ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు

### ఎపిఎం కవిత



సమావేశంలో పాల్గొన్న అధికారులు

**కేశంపేట, డిసెంబరు19, ప్రభాతవార్త:** కేశంపేట మండల కేంద్రంలో మహిళా సమైక్య ఆధ్వర్యంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను ఎపిఎం కవిత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిఆర్డిఎ డిపిఎం నరసింహ, ఎంపిడిఒ రవిచంద్ర కుమార్ రెడ్డి, ఎంపిఒ కిష్టయ్య,హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ రవిచంద్ర కుమార్ రెడ్డి మాటాడుతూ ఎన్ హెచ్ సి సెంటర్‌కు మధ్యాహ్న భోజనం ఏర్పాటు విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని ఆయన తెలిపారు. డి ఆర్ డి ఎ డి పి ఎం మాట్లాడుతూ వికలాం గులకు సహాయ పరికరాలు సదరం సర్టిఫికెట్లు కల్పిస్తామని తెలిపారు. ఎపిఎం కవిత మాట్లాడుతూ ఎన్ హెచ్ సి సెంటర్ కు వికలాంగులకు కల్పిస్తున్న ఫిజియో థెరపీ, వికలాంగుల ఎదుగుదలకు కావలసిన ఆర్థిక సహాయం సంఘాల ద్వారా కల్పిస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సమైక్య మండల అధ్యక్షురాలు భాగ్యమ్మ మాట్లాడుతూ దివ్యాంగుల సెంటర్‌కు వికలాంగులు సరైన సమయానికి వచ్చి ఎన్ హెచ్ సి సేవలను ఉపయోగించుకోవాలని ఆమె కోరారు. ఈ కార్య క్రమంలో సిసిలు యాదయ్య, లక్ష్మమ్మ, నరసింహ, మంజుల, జానకి, అలివేలు, మరియు సమైక్య కార్యదర్శి సుగుణమ్మ, కోశాధికారి గీత,

# అబద్ధపు ప్రచారాలు మానుకోండి

**-వాస్తవాలు తెలుసుకోండి**

**-క్లారిటీ ఇచ్చిన యెన్నం రఘుపతి రెడ్డి**

**కేశంపేట, డిసెంబరు19, ప్రభాతవార్త:** అనవసరంగా తమపై దుష్ప్రచారం చేయడం మంచి పద్ధతి కాదని, ఏదైనా పూర్తి సమాచారం తెలుసుకున్న తర్వాత బయటకి తెలిపితే బాగుంటుంది కానీ ఏదీ లేకుండా ఇష్టం వచ్చినట్లు వ్యవ హరించడం అవివేకమని సంగెం గ్రామ కాంగ్రెస్ నాయకులు యెన్నం రఘుపతి రెడ్డి మండిపడ్డారు. కేశంపేట మండల పరిధిలోని సంగెం గ్రామంలో రాజుకున్న వాటర్ ఫిల్టర్ వివాదంపై ఆయన స్పందించారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా నెలకు 20 వేల రూపాయల స్వంత ఖర్చుతో గ్రామస్తులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు వృధాగా ఉన్న పంచాయతీకి చెందిన భవనంలో వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. రెండు సంవత్సరాలుగా నిరంతరాయంగా వాటర్ ఫిల్టర్ నడుపుతూ గ్రామస్తులకు నిరందిస్తూ సేవ చేసామన్నారు. ఎన్నికల కు ముందు బోరు మోటర్లు కాలిపోవడంతో రూ. 30 వేలు ఖర్చు చేసి వాటిని రిపేర్ చేయించి ఫిల్టర్ ప్రారంభించామన్నారు. అయితే వేస్ట్ వాటర్ పైప్లైన్ నిండి పోవడంతో గ్రామస్తులు వడ్ల ధాన్యాన్ని సిసి రోడ్లపై ఎండబెడుతుండటంతో అవి పాడు కాకుండా ఉండటానికి వాటర్ ఫిల్టర్ నీటి సరఫరా ఆగిందన్నారు. తిరిగి పైప్‌లైన్ పనులు చేయించి ఫిల్టర్‌ను గ్రామస్తులకు అందుబాటులోనికి తేవాలని చూసిన క్రమంలో ఎంపిఇడిఒ అధికారికి ఎవరో ఫిర్యాదు చేశారని, ఫిల్టర్ అక్కడ నుండి తీసివేస్తే కొత్తగా ఏర్పాటు చేస్తారని పంచాయితీ కార్యదర్శి ద్వారా తమకు సమాచారం అందడంతో అక్కడ నుండి వాటర్ ఫిల్టర్ తొలగించడం జరిగింద న్నారు. ఇది ఏది తెలుసుకోకుండా సంగెం గ్రామంలో సర్పంచ్ అభ్యర్థి గెలవక పోవడంతోనే వాటర్ ఫిల్టర్ తీసివేశారని కొందరు ప్రచారం చేసి పైశాచిక ఆనందాన్ని పొందారన్నారు. మాకు గ్రామస్తులంతా ఒక్కటే సేవ చేశామే కానీ దుర్మార్గం చేయలేదు. అధికారుల ఆదేశాలమేరకే వాటర్ ఫిల్టర్ తీసివేశామనే విషయం గ్రహించాలని, అనవసరంగా తమపై కొందరు బురద చల్లాలనీ చూస్తే సహించమనిఘాటుగాస్పందించారు.

## నాడు మామ... నేడు కోడలు

**-ఒకే కుటుంబం నుంచి రెండోసారి సర్పంచులు**

**ధారూరు, డిసెంబరు 19, ప్రభాతవార్త:** ధారూర్ మండల పరిధిలోని మైలారం గ్రామ సర్పంచ్ నాడు మామ బాబ్యా నాయక్ ఉండగా, రెండో విడత స్థానిక



మైలారం సర్పంచ్ శాంతి బాయ్ దేవేందర్

సంస్థ ఎన్నికల్లో బి ఆర్ ఎస్ పార్టీ ుంచి పోటీ చేయగా కోడలు శాంతి బాయ్ దేవేందర్ సర్పంచ్‌గా గెలుపొందింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెండోవసారి సర్పంచ్‌గా మైలారం ప్రజల ఇచ్చిన తీర్పు ను మరువలేనని, గ్రామాభివృద్దే తన మొదటి ధ్యేయంగా నిరంతరం కృషి చేస్తానని అన్నారు. ప్రభుత్వ నిధుల ు పారదర్శకంగా వినియోగించి, ప్రతీ కుటుంబం అభివృద్ధి చెందేలా పనిచేస్తానని హామీనిచ్చారు. తనపై నమ్మకంతో సర్పంచ్‌గా గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

## నాడు సఫాయి కార్మికుడు నేడు సర్పంచ్

**పరిగి రూరల్ , డిసెంబరు 19, ప్రభాతవార్త:**

పరిగి మండల పరిధిలోని ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన బూరుగు ఆశప్ప అనే వ్యక్తి నాడు గ్రామపంచాయతీ సఫాయి కార్మికునిగా పనిచేసి నేడు అదే గ్రామానికి సర్పంచిగా బి ఆర్ఎస్ పార్టీ నుండి సర్పంచ్ బరిలో నిలబడి అత్యధిక మెజార్టీతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిపై 8 వార్డులకుగాను ఆరు వార్డులు వరుసగా గెలుపొంది పరిగి మండల పరిధిలో ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్న వ్యక్తిగా గెలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇబ్రహీంపూర్ గ్రామ ప్రజలకు తాను ఎల్లవేళలా రుణపడి ఉంటానని నాపై నమ్మకం ఉంచి సర్పంచిగా గెలిపించినందుకు గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ గ్రామ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు .

## ఏళ్ల తరబడి ఇబ్బందులు ఎదుర్కొన్న సమస్య పరిష్కారం

**-రైతు కాలనీ చౌరస్తాలో రోడ్డుకు అడ్డంగా ఉన్న స్తంభం తొలగింపు**

**-హర్షం వ్యక్తం చేసిన రైతు కాలనీ, ఫరూక్ నగర్, శ్రీనివాస కాలనీ వాసులు**

**-విద్యుత్ మరమ్మత్తు పనులను పరిశీలించిన మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్**

**షాద్‌నగర్, డిసెంబరు 19, ప్రభాతవార్త:** ఏళ్ల తరబడి రోడ్డుకు మధ్యలో అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఎట్టకేలకు తొలగించడమే కాకుండా ప్రజలకు ప్రయాణ వెసులుబాటు కలిగించే విధంగా సౌకర్యాన్ని కల్పించి అదేవిధంగా ఆ ప్రాంతంలో ఉన్న మిగతా సమస్య గల స్తంభాలను కూడా తొలగించి పెద్ద ఎత్తున మరమత్తు పనులు చేపట్టారు విద్యుత్ శాఖ అధికారులు. స్థానికుడు కాంగ్రెస్ నాయకుడు సయ్యద్ ఖదీర్ విద్యుత్ సమస్య పట్ల స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు విన్నవించగా స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వెంటనే స్పందించి కీళ్ల తరబడి మేలుకొని ఉన్న సమస్యను పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడారు. విద్యుత్ శాఖ డీఈ శ్యాంసుందర్ రెడ్డి, ఏయీ వినోద్ గౌడ్ తదితర విద్యుత్ సిబ్బంది శుక్రవారం రైతు కాలనీ చౌరస్తాలోని అడ్డంగా ఉన్న స్తంభాన్ని తొలగించేందుకు చర్యలు చేపట్టారు. ఈ స్థలంతో పాటు రోడ్డుకు మరికొన్నిచోట్ల ఇలాగే అడ్డంగా ఉన్న స్తంభాలను అన్నింటిని విద్యుత్ శాఖ అధికారులు తొలగించారు. ఉదయం పనులు ప్రారంభించి సాయంత్రం దాకా ఈ పనులు చేపట్టి స్థానిక ప్రజల మన్ననలను పొందారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్, సయ్యద్ ఖదీర్, కాంగ్రెస్ పార్టీ



రహదారికి అడ్డంగా ఉన్న స్తంభాన్ని తొలగిస్తున్న దృశ్యం

మైనార్టీ నేత మహమ్మద్ ఇబ్రహీం, మహబూబ్ తదితరులు ఈ పనులను స్వయంగా దగ్గరుండి పర్యవేక్షి ంచారు.

ప్రజల వెసులుబాటు కోసం విద్యుత్ శాఖ సిబ్బంది నిర్విరామంగా పనిచేసే సమస్యను పరిష్కరించినందుకు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్ ఎమ్మెల్యే శంకర్ తదితర సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఏళ్ల తరబడి పెండింగ్లో ఉన్న ఇలాంటి సమస్యలను పరిష్కరించినందుకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## గ్రామ స్వరాజ్యాన్ని కాపాడేందుకు కృషి చేస్తాం

**షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**షాద్‌నగర్, డిసెంబరు 19, ప్రభాతవార్త:** కేశంపేట గ్రామపంచాయతీ అభివృద్ధి బాధ్యత తనదని గ్రామాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. ఇటీవల గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నూతనంగా ఎన్నుకోబడిన సర్పంచ్ బొజ్జం శ్రీశైలం తదితర వార్డు సభ్యులు శుక్రవారం షాద్ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ సర్పంచ్ శ్రీశైలం తదితర వార్డు సభ్యులను అభినందించి వారిని శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు ప్రభుత్వ సహకారంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను



కేశంపేట సర్పంచ్ బొజ్జం సంతోష శ్రీశైలంను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

పంచాయతీ ద్వారా చేపట్టేందుకు నిధులను తగినంతగా కేటాయిస్తామని స్పష్టం చేశారు. గ్రామాల్లో ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు ఉండాలని ఆ తర్వాత అందరూ కలిసికట్టుగా పనిచేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. గ్రామాల్లో ఐక్యత ద్వారానే అనేక అభివృద్ధిని సాధించవచ్చు అని ఆయన సూచించారు. గెలిచిన ప్రజాప్రతినిధులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళలా గ్రామ స్వరాజ్యాన్ని కాపాడేందుకు గ్రామపంచాయతీలను పటిష్టం చేసేందుకు కృషి చేస్తుందని స్పష్టం చేశారు.

## నూతనగా ఎన్నికైన సర్పంచ్, మరియు వార్డు సభ్యులకు సన్మానం

**-అభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తాన్న ఎమ్మెల్సి నవీన్ రెడ్డి**

**కేశంపేట, డిసెంబరు19, ప్రభాతవార్త:** కేశంపేట మండల కేంద్రంలో నుండి నూతనంగా ఎన్నుకోబడిన సర్పంచ్ బొజ్జల సంతోష శ్రీశైలం యాదవ్, వార్డు సభ్యులను ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిని తన కార్యాలయంలో సన్మానించారు.ఈ సందర్భంగా కేశంపేట సర్పంచ్ మరియు వార్డు సభ్యులు తమ గ్రామ అభివృద్ధి కొరకు సహాయ సహకారాలు అందించాలని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిని కోరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సి నవీన్ రెడ్డి మాట్లాడుతు కేశంపేట గ్రామ అభివృద్ధికి తనవంతుగా సహాయ సహకారాలు తప్పకుండా అందిస్తానని నూతనంగా ఎన్నుకోబడిన సర్పంచ్ మరియు వార్డు సభ్యులకు భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో పోమాల్ పల్లి సర్పంచ్ భూపాల్ రెడ్డి, వార్డు మెంబెర్స్ మరియు మంచే కృష్ణయ్య,దశరథ్,సతీష్,ప్రవీణ్ రెడ్డి,నాగేష్ రామచంద్ర నాగేష్ విజయ్ శీను మహేష్,రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## హిందూ ముస్లిం.. భాయ్ భాయ్

**-మతాలకు అతీతంగా అయ్యప్ప స్వాములకు సేవ**

**-మొగలిగిద్ద మాజీ వార్డు సభ్యుడు, యువ నాయకుడు తబ్రేజ్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు భిక్ష..**

**-యువ నాయకుడిని సత్కరించిన అయ్యప్ప స్వాములు..**



మైనార్టీ నాయకుడు తబ్రేజ్ ను సన్మానిస్తున్న అయ్యప్ప భక్తులు

**షాద్‌నగర్, డిసెంబరు 19, ప్రభాతవార్త:** హిందూ.. ముస్లిం.. క్రిస్టియన్.. మతం ఏదైనా తన మతాన్ని తల్లిలా భావించాలి.. అదేవిధంగా పరమతాన్ని ప్రాణ నేస్తం లా గౌరవించాలి.. జాతిపిత మహాత్మా గాంధీ చెప్పిన ఈ మాటలను అక్షర సత్యాలుగా మారుస్తూ అయ్యప్ప స్వాములకు అన్న వితరణ కార్యక్రమాన్ని చేపడుతూ ముస్లిం యువకులు కొత్త మార్గంలో పయనిస్తున్నారు. అదే మార్గంలో ఫరూక్ నగర్ మండలం మొగలిగిద్ద గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు, యువ నాయకులు తబ్రేజ్ ఒక అడుగు ముందుకు వేశాడు. గ్రామంలో అయ్యప్ప స్వాములకు అన్న వితరణ బిక్ష కార్యక్రమాన్ని చేపట్టి పరమతం పట్ల తనకున్న గౌరవాన్ని చాటాడు. ఈ సందర్భంగా పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మతం ఏదైనా దైవం ఒక్కటేనని.. ఏ దైవం అయినా మనుషులంతా ఒక్కటిగా కలిసి ఉండాలని కోరుకుంటుందని అన్నారు. ప్రతి ఒక్కరు తన మతాన్ని ఆచరిస్తూ, పరమతాన్ని గౌరవిస్తూ ముందుకు సాగితే ఎలాంటి వివాదాలు ఉండవని స్పష్టం చేశారు. మతాలకు అతీతంగా ఇతను చేసిన సేవా కార్యక్రమాలు గ్రామస్తుల ప్రశంసలు అందుకుంటున్నాయి. అయ్యప్ప స్వాములతో పాటు గ్రామ పెద్దలు కార్యక్రమంలో పాల్గొన్నారు.



సర్పంచ్,వార్డు సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

## కేశంపేటని అభివృద్ధి చేయడం నా బాధ్యత

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**కేశంపేట, డిసెంబరు19, ప్రభాతవార్త:** కేశంపేట గ్రామపంచాయతీని అన్ని విధాల అభివృద్ధి చేసే బాధ్యత తనదని గ్రామాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. ఇటీవల గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నూతనంగా ఎన్నుకోబడిన సర్పంచ్ బొజ్జం సంతోష శ్రీశైలం యాదవ్ తదితర వార్డు సభ్యులు శుక్రవారం షాద్ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ సర్పంచ్ బొజ్జం సంతోష శ్రీశైలం యాదవ్ తదితర వార్డు సభ్యులను అభినందించి వారిని శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు ప్రభుత్వ సహకారంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను పంచాయతీ ద్వారా చేపట్టేందుకు నిధులను తగినంతగా కేటాయిస్తామని స్పష్టం చేశారు. గ్రామాల్లో ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు ఉండాలని ఆ తర్వాత అందరూ కలిసికట్టుగా పనిచేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. గ్రామాల్లో ఐక్యత ద్వారానే అనేక అభివృద్ధిని సాధించవచ్చు అని ఆయన సూచించారు. గెలిచిన ప్రజాప్రతినిధులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళలా గ్రామ స్వరాజ్యాన్ని కాపాడేందుకు గ్రామపంచాయతీలను పటిష్టం చేసేందుకు కృషి చేస్తుందని స్పష్టం చేశారు.

## అంబులెన్స్ సిబ్బంది పనితీరు చాలా బాగుంది

**కేశంపేట, డిసెంబరు19, ప్రభాతవార్త:** కేశంపేట మండల కేంద్రంలో అంబులెన్స్ వాహనాన్ని ఆకస్మికంగా ఎమర్జెన్సీ మేనేజ్మెంట్ ఎగ్జిక్యూటివ్ సిబ్బంది తనిఖీ చేశారు. వైద్య పరికరాల పనితీరు అత్యవసర సమయంలో వినియోగించే మెడికల్ సామాగ్రిని, మరియు మెడికల్ రికార్డులను పరి శీలించారు. అన్ని రికార్డులు సక్రమంగానే ఉన్నాయని సిబ్బంది పనితీరు బాగుందని అన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవలు అం దించాలని సిబ్బందికి సూచిస్తూ. అత్యవసర సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పైలెట్ సిబ్బంది సురేష్, దీపక్‌లు పాల్గొన్నారు.



అంబులెన్స్ వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎమర్జెన్సీ మేనేజ్మెంట్ ఎగ్జిక్యూటివ్ సిబ్బంది

## ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

**సోండేపూర్ ఉప సర్పంచ్‌ప పాండు నాయక్**

**పరిగి, డిసెంబరు19, ప్రభాతవార్త:** పరిగి మండలపరిధిలోని సోండేపూర్ ఉపసర్పంచ్గా పి.పాండు నాయక్ ఎన్నికయ్యారు పాండు నాయక్ మాట్లాడుతూ అందరి సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించినందుకు తండా వాసులకు కృతజ్ఞతలు తెలిపారు.



ఉప సర్పంచ్ పాండు నాయక్

## నిరుపేదలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**కీసర,డిసెంబరు19, ప్రభాతవార్త:** నిరుపేదలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని దమ్మాయిగూడ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పా రామారావు అన్నారు.శుక్రవారం దమ్మాయిగూడ వెంకటేశ్వర కాలనీలో ఉచిత వైద్య శిబిరాన్ని పీపుల్స్,వెల్ఫెర్ ట్రస్టు,నవోదయ సంక్షేమ వేదిక, సిఐటియు మండల కమిటీలు సంయుక్తంగా ఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఐటియు పేదలకు,కార్మికులకు చేస్తున్న సేవలను కొనియాడారు.ట్రస్టు,సంక్షేమ వేదిక ద్వారా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం తో పాటు చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలకు మా వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.పేదలు నివాసం ఉంటున్న ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి మందులు పంపిణీ చేయడం అవసరమైన వారికి కాటరాక్ట్ ఆప రేషన్ చేయించడం కంటి అద్దాలు సరసమైన ధరలకు అందించడం చాలా గొప్ప విషయమన్నారు. మాజీ వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ సిఐటియు ఆధ్వర్యంలో ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వాటిని నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సిఐటియుకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు.మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్,కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ అధ్యక్షురాలు ఈగ శ్వేత రాజు ముదిరాజు మాట్లాడుతూ నేడు మహిళలు ఎదుర్కొంటున్న ప్రధానమైన ఆరోగ్య సమస్యలు టెస్ట్ క్యాన్సర్ ఒకటని వెంటనే క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్న సిఐటియుకి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.ఈ వైద్య శిబిరంలో 176 మంది పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి,పిడబ్ల్యూటి ట్రస్ట్ చైర్మన్ వరప్రసాద్,సంక్షేమ వేదిక అధ్యక్షురాలు శ్రీదేవి,ట్రస్టు బాధ్యులు దేవిరెడ్డి,సిఐటియే కార్యదర్శి నర్సింగ్‌రావు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.



దమ్మాయిగూడలో ఉచిత వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**కీసర,డిసెంబరు19,ప్రభాతవార్త:** ఫీడర్ నిర్వహణ కారణంగా (నేడు) శనివారం కొన్ని ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు మండల విద్యుత్ ఏఈ మురళీ క్రిష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.11 కెవి ఆర్‌టిసి కాలనీ రాంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని ఉదయం 10.30 గంటల నుండి 11 గంటల వరకు ఆర్‌టిసి కాలనీ,క్రిష్ణరెడ్డి నగర్,ఎల్‌మోట్ కాలనీ,శ్రీనివాస నగర్ కాలనీ,రిక్విల్ ఫోర్డ్ స్కూల్,పిఎన్ఆర్ కాలనీ,మధురనగర్,ఓయు కాలనీ,హెవెనన డౌన్, టిపిఎస్ పుష్ప,ప్రజయ్ సాయి గార్డెన్,11 కెవి ఆర్ఎల్ నగర్ కాలనీ ఫీడర్ రాంపల్లి సాయంత్రం 4 గంటల నుండి 4.30 నిమిషాల వరకు ఆర్ఎల్ నగర్,ప్రగతి నగర్,శేషాద్రి నగర్,శ్రీదేవి నగర్,పోచమ్మ ఆలయం,గణేష్ నగర్,ఓయు కాలనీ,సూర్య నగర్,లయన్స్ క్లబ్ హస్పిటల్,భరత్ నగర్,కీసర సబ్‌స్టేషన్ నుండి మద్యాహ్నం 1 గంట నుండి 2 గంటల వరకు 11 కెవి చీర్యాల లక్ష్మీ ఫీడర్ నుండి కుందన్‌పల్లి,వర్ధాన స్కూల్,వికలాంగుల కాలనీ,గోదుమకుంట,ఏజిఎల్ సేవలు రాంపల్లి సబ్‌స్టేషన్ నుండి మద్నాహ్నం 3 గంటల నుండి 3.30 నిమిషాల వరకు ఇండస్ట్రీయల్ ఏరియా,హెచ్‌టి సర్వీసెస్‌లలో విద్యుత్ నిలిపివేస్తున్నామని విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

## గుర్తు తెలియని మహిళ పుర్రె లభ్యం

**కీసర,డిసెంబరు19,ప్రభాతవార్త:** దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాయిపల్లి అటవీ ప్రాంతంలో ఓ మహిళ పుర్రె లభ్యమైంది.గుర్తు తెలియని మహిళ మృతి చెంది ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.సుమారు 4 నెలల క్రింద జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు.ఈ మేరకు కేసును నమోదు చేసి దర్యాప్తు చేపట్టా మని సిఐ ఆంజనేయులు తెలిపారు.ఇటీవల ఎక్కడైనా మహిళ మిస్సింగ్ కేసులు న మోదు అయి ఉంటే కీసర పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని సిఐ సూచించారు.



తిమ్మాయిపల్లిలో మహిళ పుర్రెను పరిశీలిస్తున్న సిఐ ఆంజనేయులు